క్లుప్తంగా

హైస్కూల్‌లో విజిలెన్స్‌పై అవగాహన



పోటీల్లో విజేతలైన విద్యార్థులతో గ్రామీణ బ్యాంక్ అధికారులు, ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: సర్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవగాహన సదస్సును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జి రాంబాబు, రాజమండ్రి రీజినల్ మేనేజరు గంటా శ్రీనివాసరావు విద్యార్థులకు అవినీతి యొక్క దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజా ప్రసన్న కుమార్, గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

14న సీతారామస్వామి కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా ఈ నెల 14 ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వర్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం చేయించుకొనే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. స్వామి వారి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి

బోట్‌క్లబ్: ఎన్నో డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులు బుధవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు ఆయన కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. వ్యాలిడేషన్ చట్టం రద్దు చేయాలని, పదవీవిరమణ అయిన పాత వారికి, కొత్త వారికి 8వ వేతన సంఘం సిఫార్సులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. దీనికి ఎంపీ స్పందించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ పి.మహేశ్వరరావు, కన్వీనర్ తురగా సూర్యారావు, సభ్యులు డీఎల్ఎస్ శాస్త్రి, సీహెచ్ రామారావు, ఎస్.త్రినాథరావు ఎస్ఎస్ సాయిరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

కాకినాడ క్రైం: స్థానిక భానుగుడిలో ఉన్న అంబికా ఎక్వేరియం రెస్టారెంట్ యాజమాన్యం తన దాతృత్వాన్ని చాటుకుంది. శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వేదికగా ఇద్దరు విద్యార్థుల చదువు కోసం రూ.40 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. దాతలు కోన సతీష్ ప్రశాంతి దంపతుల సమక్షంలో శ్రీ యువసేన వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ ఆధ్వర్యంలో సాయం మొత్తాన్ని విద్యార్థులు కాకినాడకు చెందిన శ్రీ రాంపవన్, సామర్లకోటకు చెందిన పూజా శరణ్యలకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ చేతుల మీదిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు నున్న దొరబాబు, సత్తి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



క్రాకర్స్ తయారీ షాపును పరిశీలిస్తున్న రూరల్ సీఐ చైతన్యకృష్ణ

కరప: నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ అన్నారు. ఎస్పీ ఆదేశాలు మేరకు బుధవారం కరప మండలంలోని మూడు ఫైర్ కాకర్స్ తయారీ షాపులను కరప ఎస్ఐ టి.సునీతతో కలిసి ఆయన తనిఖీ చేశారు. మందుగుండు సామగ్రి తయారీదారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమతి లేకుండా దీపావళి సామాన్లు నిల్వ ఉంచకూడదన్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే మంటలు అదుపుచేసే సామాన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

నడకుదురు మాజీ ఎంపీటీసీ మృతి



విష్ణుచక్రం (ఫైల్)

కరప: నడకుదురులో మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లువరస విష్ణుచక్రం(56) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. 2005లో ఆయన ఎంపీటీసీ సభ్యుడిగా సేవలందించారు. గ్రామాభివృద్ధికి మాజీ ఎంపీటీసీ విష్ణుచక్రం సేవలు మరువలేనివని గ్రామస్తులు మననం చేసుకుంటున్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ డేగల లలితకుమారి, యాసలపు విష్ణుమూర్తి తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

నగరవాసం.. యమపాశం..

- నగరంలో పెరుగుతున్న కాలుష్యం
- అధికమవుతున్న శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు
- మరణాలకు దారి తీస్తున్న వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కాకినాడ క్రైం: నగరంలో కాలుష్యం అధికమవుతోంది. ప్రజలకు ముప్పు పొంచి ఉంది. పెరిగిన వాయు కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఎక్కువగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారు. ఆసుపత్రిల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కాకినాడ నగరంలో గడచిన నాలుగేళ్లలో కాలుష్య స్థాయి పెరుగుతూ వస్తోంది. అయినా అధికారులు కాలుష్య నియంత్రణను ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కాలుష్యానికి కారణాలివే..

వాయు కాలుష్యానికి ప్రధాన కారణం కర్మాగారాల నుంచి విడుదలవుతున్న వాయువులు, వాహనాల నుంచి వస్తున్న పొగ కారణంగా కాలుష్యం మరింత పెరుగుతోంది. ప్రతి ఇంటికి బైక్, కారు అంటూ రెండు మూడు వాహనాలు ఉంటున్నాయి. ఈ వాహనాలకు వినియోగిస్తున్న ఇంధనాలైన పెట్రోలు, డీజిల్ కార్బన్‌మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌తోపాటు పలు ప్రాణాంతక వాయువులను విడుదలవుతున్నాయి. ఇవే కాకకుండా కర్మాగారాలు ధూళి, విషపూరిత రసాయనాలను విడుదల చేస్తుండగా, నగరాల్లో నిత్యం ఎక్కడో ఒక దగ్గర జరిగే నిర్మాణ పనుల వల్ల ధూళి ముమ్మరంగా వ్యాపిస్తోంది. ఊరి చివర్లో ఏర్పాటు చేసే డంప్ యార్డుల నుంచి నిత్యం పొగ వాతావరణాన్ని కలుషితం చేస్తోంది. వ్యర్థాలకు నిప్పు పెట్టడమే అందుకు కారణం. జనసంచారంతో పాటు నగర విస్తరణ పెరిగి గాలి ప్రవాహం తగ్గుతోంది. తద్వారా కాలుష్యం ఎక్కువ సమయం గాలిలో ఉంటూ శ్వాస కోశాల్లోకి చేరుతోంది.

నివారణ ఇలా...

వాయు కాలుష్యాన్ని నివరించేందుకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును వినియోగించాలి. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించాలి. కలుషితమవుతున్న గాలిని శుద్ధి చేయడంలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తాయి. మొక్కలు నాటి వృక్షాలను సంరక్షించాలి. పరిశ్రమల్లో వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు వినియోగించాలి. వాటి వినియోగం కొనసాగేలా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలి. వ్యర్థాలను రీ సైకిల్ చేసే శాస్త్రీయ విధానాలను అనుసరించాలి. కాల్చకూడదు, అలా చేస్తే వాయు కాలుష్యం మరింత పెరుగుతుంది. కాలుష్య రహిత రవాణా విధానాలను అనుసరించాలి.

వ్యాధులతో ముప్పు

కాకినాడ నగరంలో నానాటికీ వాయు కాలుష్యం అధికమవుతోంది. పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల సంఖ్య అందుకు తార్కాణం. ఆస్తమా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, దగ్గు, క్రోనిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్(సీవోపీడీ) ప్రధాన శ్వాసకోశ వ్యాధులు కాగా, కాలుష్యం హృద్రోగ సమస్యలకు దారి తీస్తోందని వైద్యులు చెబుతున్నారు. హృదయంపై ఒత్తిడి అధికమవ్వడమే ఇందుకు కారణమంటున్నారు. అలాగే కాలుష్య ప్రభావం పిల్లలపై పడితే వారి శారీరక, మానసిక అభివృద్ధి మందగిస్తుందని చంటిపిల్లల వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐక్యూ ఎయిర్ గణాంకాల ప్రకారం కాకినాడలోని వాయు నాణ్యత మోడరేట్ స్థాయిలో ఉంది.

గడచిన రెండేళ్లలో కాకినాడ జీజీహెచ్ పల్మనాలజీ విభాగంలో వైద్యసేవలు పొందిన రోగుల గణాంకాలు ఇలా..

2024లో..	
జనవరి–మార్చి	: 4280 మంది
ఏప్రిల్–జూన్	: 5502 మంది
జూలై–సెప్టెంబర్	: 5877 మంది
అక్టోబర్–డిసెంబర్	: 6008 మంది
2025లో..	
జనవరి–మార్చి	: 6222 మంది
ఏప్రిల్–జూన్	: 6289 మంది
జూలై–సెప్టెంబర్	: 6850 మంది

ఏక్యూఐ డాటిన్ ప్రకారం పీఎం2.5 విలువ 27 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్లు, కాగా పీఎం10 విలువ మైక్రో గ్రామ్ పర్ క్యూబిక్ మీటర్లు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 84గా కొనసాగుతోంది.

పెరుగుతున్న కేసులు

కాకినాడ జీజీహెచ్‌లో పల్మనాలజీ విభాగం నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. గడచిన రెండేళ్లలో రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. వాయు కాలుష్యానికి గురై ఆసుపత్రి పాలవుతున్న వారి సంఖ్య అధికమవుతోందని వైద్యులే చెబుతున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై నమ్మకం లేక..



బ్యాటరీ వాహనాలు కాలుష్యాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే వాటి వ్యయం ఎక్కువ. నాణ్యతలో లోపాలు తలెత్తడంతో బ్యాటరీ వాహనాలపై నమ్మకం ఉండడం లేదు. ప్రభుత్వాలు బ్యాటరీ వాహనాలు వినియోగాన్ని ప్రోత్సహించాలి. కొనుగోలు చేసే వారికి సబ్సిడీ ఇవ్వాలి. అలాగే వాటి బ్యాటరీలు పేలిపోవడంతో పాటు రిపేర్లు సకాలంలో జరగడం లేదు. దీంతో ప్రజల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ఆసక్తి ఉండడంలేదు. పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మంచిది.

– దీకట్ల రాజశేఖర్, కాకినాడ

ప్రాణానికి ముప్పు



శ్వాసకోస సమస్యలు ప్రాణాంతకంగా మారాయి. వాటి ప్రభావం వెంటనే తెలియదు. శ్వాసకోశ వ్యవస్థ బలహీనమవుతాయి. శ్వాసకోశ సమస్యలతోపాటు హృదయ, చర్మ, కంటి సమస్యలు అధికమవుతాయి. వృద్ధులు, చిన్నపిల్లలతో పాటు గర్భిణులకు ప్రమాదకరం. పుట్టబోయే పిల్లల జననం నాణ్యంగా ఉండదు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుతో వాయుకాలుష్యాన్ని నివారించవచ్చు.

– డాక్టర్ రాజేంద్రకుమార్, పల్మనాలజిస్టు, విశ్రాంత హెచ్‌వోడీ పల్మనాలజీ, ఆర్ఎంసీ

ఘనంగా వాయుసేన వ్యవస్థాపక దినోత్సవం



రమణయ్యపేటలో వాయుసేన విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

కాకినాడ రూరల్: భారత వాయుసేన 93వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద వాయుసేన దినోత్సవం నిర్వహించిన వాయుసేన విశ్రాంత సిబ్బంది ఎస్.శ్రీనగేష్, బి.శివకుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనగేష్ మాట్లాడుతూ దేశ భద్రతలో వైమానిక దళం కీలక పాత్ర పోషిస్తుందని, శత్రు దేశాల నుంచి మన దేశాన్ని కాపాడంతో ముందు ఉంటుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో 1932 అక్టోబరు 8న భారత వాయుసేన ఏర్పడడంతో ప్రతి సంవత్సరం వాయుసేన దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. శివకుమార్ మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీకి భారత వాయుదళం అందించిన సహకారం, వివిధ యుద్ధాలతో వాయుసేన పోరాటం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, రేలంగి బాపిరాజు, సత్యనారాయణరాజు, రవిశంకర్ పట్నాయక్, వెంకటేశ్వర రావు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సామర్లకోట: అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం కావడానికి ఐసీడీఎస్ సూపర్‌వైజరు కృషి చేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు సీహెచ్ శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా స్థాయి రివ్యూ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు తక్కువగా ఉంటున్నారని, కేంద్రాలకు సిబ్బంది ఆలస్యంగా హాజరు కావడంపై మండిపడ్డారు. సమయానికి కేంద్రానికి వచ్చి పిల్లలు ఎక్కువ మంది వచ్చేలా చూడాలన్నారు. అనంతరం పిల్లల తల్లులకు అవగాహన పెంచాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తరచూ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేసి ఫొటోలను ఆప్‌లోడ్ చేయాలన్నారు. ఆటపాటలతో కూడిన విద్య నేర్పడంతో పాటు, వారానికి ఒకసారి విద్యార్థుల మధ్య పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లపై ఉందని తెలిపారు. ఈ మేరకు మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు.

మ్యూజియంను అందుబాటులో ఉంచాలి

- సాక్షి కథనంపై కదిలిన వైఎస్సార్ సీపీ నాయకులు
- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దాపురం(సామర్లకోట): మున్సిపాలిటీ సమీపంలోని పెద్దాపురం గాంధీ పార్కులో నిర్మాణం చేసిన మ్యూజియంను ప్రజలకు అందుబాటులోనికి తీసుకు రావాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సాక్షి దినపత్రికలో 'కల నెరవేరేనా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వైఎస్సార్ సీపీ నాయకులు స్పందించారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతో మున్సిపల్ పార్కులో మ్యూజియం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో దాత బచ్చు ఫౌండేషన్ సుమారు రూ.కోటితో భవన నిర్మాణం చేయగా 2009లో అప్పటి కేంద్ర సహాయ మంత్రి ఎంఎం పల్లంరాజు ఆ భవనాన్ని ప్రారంభించారు. ఆ భవనంలో రాజకీయ నాయకులు, దేశ చరిత్ర, దేవాలయాల నమూనాలు వంటి హిస్టారికల్ దృశ్యాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వాటి బాధ్యతను పురావస్తు శాఖకు అప్పగించడంతో పాటు భవనాన్ని ఆ శాఖకు స్వాధీనం చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ భవనం (మ్యూజియం) తెరుచుకోలేదు. దాంతో ఈనెల 5వ తేదీన సాక్షి దినపత్రికలో కల నెరవేరేనా అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ ప్రజల కల నెరవేర్చడానికి వైఎస్సార్ సీపీ నాయకులు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ ఆర్లె వీర్రాఘవరావు(వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి), మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, 20వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

పెద్దాపురం(సామర్లకోట): చినబ్రహ్మదేవం గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో పెద్దాపురం ఎస్సై మౌనిక ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,100 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎస్సై మౌనిక దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- నిరుపయోగంగా మున్సిపల్ భవనం
- తుప్పు పడుతున్న రూ.లక్షలు విలువ చేసే వాహనాలు
- మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ భవనం

సామర్లకోట: గత కొన్నేళ్లుగా మున్సిపాలిటీ స్వాధీనంలో ఉన్న భవనం నిరుపయోగంగా మారింది. భవనాన్ని ఉపయోగించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ వర్కులో ఉన్న భవనాన్ని దివంగత నేత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళా సంఘాల పాల డెయిరీ నిర్వహించుకునేందుకు కేటాయించారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం మహిళా సంఘాలు నిర్వహిస్తున్న పాల డెయిరీలను మూసివేశారు. దాంతో అప్పటి నుంచి ఆ భవనం నిరుపయోగంగా ఉంది. అలాగే మున్సిపాలిటీకి చెందిన రూ.లక్షలు విలువ చేసే వాహనాలు కూడా ఉపయోగించకుండా వదలేశారు. దీంతో అవి ఇనుప ముక్కలుగా మారిపోతున్నాయి. మూలకు చేరిన వాహనాలను ఎందుకు విక్రయించడంలేదనే వాదనలు ఉన్నాయి.

మూలకు చేరిన వాటర్ ట్యాంకు

దాతలు ఇచ్చిన వాహనాలను కూడా అధికారులు పట్టించుకోకుండా వదలేశారు. 2002 పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వాటర్ ఇండియా సంస్థ అప్పట్లో సుమారు రూ.50 లక్షలు విలువ కలిగిన స్టీల్ బాడీతో ఉన్న వాటర్ ట్యాంకరును పెద్దాపురం మున్సిపాలిటీకి బహుమతిగా ఇచ్చింది. న్యూజిలాండ్ నుంచి వచ్చి భారీ వాహనాన్ని పెద్దాపురం ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. ఈ వాహనం నడపడానికి ప్రత్యేక అనుభవం ఉన్న డ్రైవర్‌ను కూడా నియమించారు. ఇతర దేశాల నుంచి బహుమతిగా ఇచ్చిన వాహనం చిన్న చిన్న రోడ్లలో తిరగడం ఇబ్బందిగా ఉందనే సాకుతో వాటర్ ట్యాంకర్ వాహనాన్ని మూలనపడేశారు. రూ.లక్షలు విలువ చేసే ఆ వాహనం ఇనుప ముక్కగా మారిపోతోంది. మరమ్మతులు చేసి వినియోగించాల్సిన వాహనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూలకు చేరిందనే ఆరోపణలు ఉన్నాయి.

వినియోగంలో లేని స్వీపింగ్ మెషీన్

గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి మున్సిపాలిటీకి రూ.కోటి విలువ చేసే స్వీపింగ్ మెషీన్, మినీ జేసీబీలను సరఫరా చేశారు. మినీ జేసీబీలు నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీలలో ఉపయోగంలో ఉన్నా స్వీపింగ్ మెషీన్లు మాత్రం వినియోగించకుండా వదిలేశారు. ఈ మెషీన్ విలువ రూ.60 లక్షల ఉంటుంది. వాటి నిర్వహణ భరించలేకపోతున్నమనే సాకుతో పట్టించుకోవడంలేదని వాదనలు ఉన్నాయి.



మూలకు చేరిన న్యూజిలాండ్ వాటర్ ట్యాంకర్



ఇనుప ముక్కగా మారుతున్న పారిశుధ్య వాహనాలు



నిరుపయోగంగా వదిలి వేసిన స్వీపింగ్ వాహనం


అవగాహన లేక నిధుల వృథా



మున్సిపాలిటీలో అవగాహన లేని అధికారుల కారణంగా మున్సిపాలిటీ ఆస్తులు పాడైపోతున్నాయి. పెద్ద పెద్ద కార్పొరేషన్లలో తిరిగే స్వీపింగ్ మెషీన్ వాహనాన్ని గ్రేడ్–2 మున్సిపాలిటీలకు ఎందుకు ఇచ్చారో అర్థం కావడంలేదు. ఈ వాహనాన్ని వినియోగంలోనికి తీసుకు రావాలని అనేక కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా నిర్వహణ వ్యయం ఎక్కువ అవుతుందనే సాకులు చెప్పారు. అటువంటి వాహనాన్ని జిల్లా కలెక్టరుకు స్వాధీనం చేసి మున్సిపాలిటీ అవసరమైన వాహనాలను తీసుకురావడంలో అధికారులు విఫలయ్యారు. చిన్న చిన్న మరమ్మతులకు గురి అయిన వాహనాలను మూలన పడవేయడంతో ఇనుప ముక్కలుగా మారిపోతున్నాయి.

– ఆర్లె రాఘవ, కౌన్సిలర్, పెద్దాపురం

అధికారుల నిర్లక్ష్యం



పెద్దాపురం వాటర్ వర్కులో గతంలో మహిళా సంఘం పాల డెయిరీ నిర్వాహణకు భవనం ఇచ్చారు. ఆ భవనాన్ని స్వాధీనం చేసుకొని వినియోగంలోనికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా స్పందన లేదు. గతంలో మున్సిపాలిటీకి దాత ఇచ్చిన ఎంతో విలువైన వాటర్ ట్యాంకర్ వాహనాన్ని మూలనపడేశారు. దాని ఇంజన్ పరిస్థితిని పరిశీలించి, ఆ వాహనాన్ని రెండుగా చేసి వార్డులలో తిరిగే విధంగా చేయాలి. ప్రజల ఆస్తులను కాపాడవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాలిటీలో ఉపయోగం లేని స్వీపింగ్ మెషీన్‌ను వెనుకకు పంపాలని ఎన్నోసార్లు చెప్పాం. అధికారులు వినడంలేదు.

– నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్, పెద్దాపురం

రిటైర్మెంట్ సమయానికి అండగా అటల్ పెన్షన్ యోజన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏజీఎం శ్రీనివాస్

బోట్‌క్లబ్: సామాన్య మధ్యతరగతి ప్రజలకు వారు రిటైర్మెంట్ సమయానికి అటల్ పెన్షన్ యోజన ఆసరాగా నిలుస్తుందని స్టేట్‌లెవెల్ బ్యాంకర్స్ కమిటీ ఏజీఎం శ్రీనివాస్ అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద ఉన్న జయ స్పందన ఫంక్షన్ హాల్లో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అటల్ పెన్షన్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ సీజీఎం పరమేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్న మొత్తం లో సేవింగ్స్ వారి భవిష్యత్తు నిధిగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎక్కువ మంది ఈ పథకాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం అతిథులను శాలువాలు కప్పి జ్ఞాపికలు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, బిజినెస్ కారస్పాండెంట్లు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీ 2.0 కార్యక్రమంలో భాగంగా కామర్స్, ఆర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు హాజరై మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాన్ని పన్నుల విధానం ఏవిధంగా ప్రభావితం చేశాయో వివరించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ బీపీ నాయుడు పన్ను శ్లాబ్‌లో వచ్చిన మార్పులు, కలిగే ఆర్థిక ప్రయోజనాలు తెలియజేశారు. నూతన జీఎస్టీ విధానంపై విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించగా బి.నవ్య ప్రథమ స్థానం(బీఏ), ఎ.ఎస్.రమ్య ద్వితీయ స్థానం (బీకామ్), బి.వీనిత తృతీయ స్థానం(బీకామ్) బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీవో సత్యనారాయణ, ఏఈవో సీహెచ్ జయరావు, కామర్స్ విభాగాధిపతి కె.లక్ష్మణరావు, పాండురంగారావు, లక్ష్మణరావు, దాసరి మధుప్రసాద్, నూకరాజు, సీహెచ్ బాలాజీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఆదిత్య విద్యార్థులు

బాలాజీచెరువు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడామైదానంలో నిర్వహించిన శ్రీనగర్ ఆదిత్య విద్యార్థులు 28 మంది రాష్ట్ర క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి తెలిపారు. జూడో, సాఫ్ట్‌టెన్నిస్, లాన్‌టెన్నిస్, స్క్వాష్, తైక్వాండో, రెస్లింగ్, సాఫ్ట్‌బాల్, స్కేటింగ్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, హాకీ విభాగాల్లో ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి అభినందించారు.

జీజీహెచ్‌లో ముగ్గురు ఉద్యోగుల సస్పెండ్

కాకినాడ క్రైం: రోగుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఎఫ్ఎన్‌వోలు, ఒక ఎంఎన్‌వోని సస్పెండ్ చేస్తూ అధికారులు ఆదేశాలిచ్చారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఎఫ్ఎన్‌వోలు జె.వరలక్ష్మి, సువర్ణ శ్రీ, ఎంఎన్‌వో అచ్యుత్ కుమార్ ఉన్నారు. వీరిలో వరలక్ష్మి రెగ్యులర్ ఉద్యోగి కాగా అచ్యుత్‌కుమార్, సువర్ణశ్రీ అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరితోపాటు డి.అన్నపూర్ణ అనే మరో ఉద్యోగిని విధుల నుంచి తొలగించమని కాంట్రాక్టు సంస్థకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వీరంతా గైనిక్ ఓటీలో పనిచేస్తారు. వీరిపై విచారణ అనంతరం ఆరోపణలు వాస్తవాలని నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు జేఎన్‌టీయూకే విద్యార్థి



హేమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహనరావు, శ్యామ్‌కుమార్

బాలాజీచెరువు (కాకినాడ): ప్రీ–రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్–25కు జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సింగంపల్లి హేమంత్‌కుమార్ ఎంపికయ్యాడు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9 వరకూ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా విద్యార్థి హేమంత్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జి.శ్యామ్‌కుమార్, పీవో ఎం.వి.వి.ఎస్.కిరణ్మయి బుధవారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో అభినందించారు.

జాబ్‌మేళా రేపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. డెక్కన్ కెమికల్ సంస్థ 200, పేటీఎం 250, మెడిప్లస్ ఫార్మసీ 100, శ్రీనివాస మెడిసిస్టమ్ 25 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని, పదవ తరగతి ఆపైన ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 86398 46568 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

సామర్లకోట: ఉమ్మడి జిల్లా స్థాయిలో కాకినాడ డీఎస్సీ క్రీడామైదానంలో నిర్వహించిన ఆటల పోటీల్లో వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టరు యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు.